RNI NO: TELTEL2023/46567

# అక్షర వేదం

తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం ప్రజల పక్షం AKSHARA VEDAM TELUGU DAILY

**విలేకరులు కావలెను**

తెలంగాణ ప్రాంతం అన్ని జిల్లాల నుండి స్టాఫ్ రిపోర్టర్లు, జిల్లా ఇన్చార్జులు, మండల రిపోర్టర్లు అర్జెంటుగా కావలెను అనుభవం ఉన్నా లేకున్నా తీసుకోబడును

చీఫ్ ఎడిటర్ -పందిళ్ల రవీందర్ (9030653934)

ఎడిటర్ -పొన్నం ప్రసాద్ గౌడ్ 9666992524

Published at Karimnagar circulated in : Telangana | సంపుటి : 04 | సంచిక : 44 | ఎడిటర్ :పొన్నం ప్రసాద్ గౌడ్ | బుధవారం 14-01-2026 | పేజీలు -8 | వెల: రూ. 05.00




## పది నిముషాల ఛాలెంజ్‌కు చెక్

- గిగ్ వర్కర్లపై ఒత్తిడి తగ్గించే విధంగా కీలక నిర్ణయం
- దీనిని తొలగిస్తూ కేంద్రం ఆదేశాలు జారీ

న్యూఢిల్లీ,

టెన్ మినట్స్ ఛాలెంజ్‌పై కేంద్రం తీవ్రంగా స్పందించింది. దీనిని తొలగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఇటీవల బ్లింకిట్, జెమటో ఇతర క్విక్ కామర్స్, ఫుడ్ డెలివరీ సంస్థలు కేవలం పది నిమిషాల్లో డెలివరీ సదుపాయాన్ని అందిస్తున్నామని ప్రకటనలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నిర్ణయంపై గిగ్ వర్కర్స్(డెలివరీ ఏజెంట్స్) తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాహనాల రిపేర్, ట్రాఫిక్ వల్ల తమకు ఇబ్బందులు కలుగుతున్నాయని వాపోతున్నారు. ఈ అంశంపై కేంద్రం ప్రభుత్వం తాజాగా కీలక ఆదేశాలు జారీ చేసింది. క్విక్ కామర్స్ ప్లాట్ ఫామ్‌లైన బ్లింకిట్, జెప్టో, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ సంస్థలకు '10 నిమిషాల డెలివరీ' విధానం తొలగించాలని కేంద్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది.కేంద్ర కార్మిక మంత్రి మన్సుఖ్ మాండవీయ.

-మిగతా 2 లో

## వీధి కుక్కల బాధ్యత రాష్ట్రాలదే

### వీధి కుక్కలకు ఆహారం పెట్టేవారు కూడా దోషులు

- ఒక్క కుక్క కరిచినా అందుకు బాధ్యత వహించాల్సిందే
- అందుకు విధించే జరిమానాలకు సిద్ధంగా ఉండండి
- ఘాటు హెచ్చరిక చేసిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, జనవరి 13 అక్షర వేదం

వీధి కుక్కల అంశంపై సుప్రీంకోర్టు మరోసారి కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ వ్యవహారంపై మంగళవారం విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం.. కుక్కల బెడదను అరికట్టేందుకు చర్యలు తీసుకోకపోతే ఆయా రాష్ట్రాలపై భారీ జరిమానాలు వేస్తామని హెచ్చరించింది. ప్రతి కుక్క కాటు కు పరిహారం చెల్లించాల్సిందేనని స్పష్టంచేసింది. వీధి కుక్కల బెడదను నివారించేందుకు రాష్ట్రాలు తగిన చర్యలు చేపట్టాలి. లేదంటే ప్రతి కుక్క కాటుకు, కుక్కల దాడిలో జరిగిన ప్రతి మరణానికి గానూ ఆయా రాష్ట్రాలపై మేం నిర్దేశించిన భారీ పరిహారాలను చెల్లించాలని

-మిగతా 2 లో








## 18న మేడారంలో కేబినేట్ భేటీ ?

- 19న మేడారం పనులకు సీఎం ప్రారంభోత్సవాలు
- 19న రాత్రికి దావోస్ వెళ్లనున్న రేవంత్

హైదరాబాద్, జనవరి 13 అక్షర వేదం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 18న ములుగు జిల్లా మేడారంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. రాజదాని వెలుపల కేబినేట్ భేటీ జరపాలని నిర్ణయించడం ఇటీవల ఇదే ప్రథమం. అయితే సిఎం షెడ్యూల్ కారణంగా అక్కడ నిర్వహించేందుకు నిర్ణయించినట్లు సమాచారం. దీనిపై అధికారికంగా సమాచారం తెలియాల్సి ఉంది. 'సమ్మక్క సారలమ్మ మేడారం మహాజాతర' ఈ నెల 28న ప్రారంభం కానుండడంతో.. సంప్రదాయానికి భిన్నంగా ఈసారి మేడారంలో క్యాబినెట్ భేటీ నిర్వహించనున్నట్లు సమాచారం. 18న ఉదయం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపనలు చేస్తారు. అక్కడే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొంటారు. అనంతరం సీపీఐ వంద సంవత్సరాల వేడుకకు

-మిగతా 2 లో



## బెంగళూరులో దారుణ ఘటన

- కామంతో యువతిపై టీనేజర్ దాడి
- తిరస్కరించడంతో చంపేసి ఇంటికి నిప్ప
- దర్యాప్తులో బయటపడ్డ అసలు వ్యవహారం

బెంగళూరు

బెంగళూరులో దారుణ ఘటన వెలుగు చూసింది. పక్కింట్లో ఉన్న ఓ అమ్మాయిపై బలాత్కారానికి పాల్పడ్డ ఇంటర్ విద్యార్తి, ఆమె తిరస్కరించడంతో కత్తితో పొడిచి చంపాడు. అంతేగాకుండా ఇంటిని తగులబెట్టాడు. అంతా అగ్నిప్రమాదమని భావించినా, పోలీసుల దర్యాప్తులో అసలు నిజం బయటపడింది. చిరుప్రాయంలోనే ఆ యువకుడి ఆలోచనలు అదుపు తప్పాయి. పక్కింటి యువతి ఒంటరిగా ఉన్నవేళ కామంతో అఘాయిత్యానికి తెగించాడు. ఆమె ప్రతిఘటించడంతో చివరకు హత్య చేసి, ఆధారాలు చెరిపేసేందుకు ఇంటికే మంటపెట్టాడు. ఆమె అగ్ని ప్రమాదంలో మరణించినట్లుగా తొలుత భావించినప్పటికీ.. పోస్టుమార్టం నివేదిక, సాంకేతిక ఆధారాలతో యువకుడి పాత్ర బయటపడింది.బెంగళూరులో జరిగిన ఈ దారుణంపై పోలీసుల కథనం.. కర్ణాటకలోని మంగళూరుకు చెందిన షర్మిల కుశాలప్ప (34) బెంగళూరులోని ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఇంజినీర్‌గా పని చేసేవారు. రామ్మూర్తినగర ఠాణా పరిధి సుబ్రహ్మణ్య లేఅవుట్‌లోని ఓ ఫ్లాట్‌లో తన స్నేహితుడితో కలిసి ఉండేవారు. ఈనెల 3న షర్మిల ఒంటరిగా ఉన్నవేళ ఫ్లాట్‌లో ఆకస్మికంగా మంటలు చెలరేగగా, ఆమె మరణించినట్లు ఫిర్యాదు అందింది.

-మిగతా 2 లో

## ఇరాన్‌తో వ్యాపార దేశాలపై ట్రంప్ అక్కసు



- 25శాతం సుంకాల విధిస్తామని తాజాగా హెచ్చరిక
- ట్రంప్ బెదిరింపులకు లొంగబోమన్న ఖొమేనీ

వాషింగ్టన్, జనవరి 13 అక్షర వేదం

ఆర్థిక సంక్షోభం, అంతర్గత తిరుగుబాటు సమస్యలతో సతమతమవుతున్న ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో పిడుగు వేశారు. ఇరాన్‌తో వాణిజ్యం చేసే దేశాలపై 25 శాతం సుంకాలను విధిస్తామని హెచ్చరించారు. ఆమెరికా జోక్యం, ట్రంప్ హెచ్చరికలపై ఇరాన్ సుప్రీం లీడర్ ఆయుతొల్లా ఖమేనీ తాజాగా స్పందించారు.

-మిగతా 2 లో

## ఉగ్రవాదానికి తెగిస్తే గట్టిగా బుద్ది చెబుతాం

### ఆపరేషన్ సిందూర్‌లో భూతల దాడులకు కూడా సిద్ధపడ్డాం

- భద్రతా సవాళ్లను ఎదుర్కోవడంలో భారత్ సైనిక సంసిద్ధత
- షక్సాగామ్ వ్యాలీ ఎప్పటికీ భారత్‌లో భాగమే
- మీడియా సమావేశంలో ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది



న్యూఢిల్లీ : జనవరి 13 అక్షర వేదం

ఉగ్రవాదులు తెగిస్తే గట్టిగా బుద్ధి చెబుతామని, ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోందని, త్రివిధ దళాల సమన్వయానికి ఇది నిదర్శనమని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది అన్నారు. దిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆయన ..భద్రతా సవాళ్లను ఎదుర్కోవ డంలో భారత్ సైనిక సంసిద్ధత దీనిద్వారా స్పష్టమైందని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌ను చాలా కచ్చితత్వంతో అమలుచేశాం. 88 గంటల పాటు సాగిన ఆ ఆపరేషన్‌లో మన సైనిక దళాలు అత్యంత సమర్థంగా పనిచేశాయి. ఉగ్ర శిబిరాలను నేలమట్టం చేయగలిగాం. దాదాపు 100 మంది ఉగ్రవాదులను హతమార్చాం. ఆ సమయంలో పెద్దఎత్తున బలగాలను సరిహద్దులకు తరలించాం.

-మిగతా 2 లో

## గాంధీపేరుతో కాంగ్రెస్ నీచ రాజకీయం

### పథకాలతో సహా అన్నిటికి ఇంది, రాజీవ్ పేర్లేనా



- వాల్మీకి-అంబేడ్కర్ పేరున్న పథకం పేరు ఎందుకు మార్చారు
- కాంగ్రెస్ రాజకీయాలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి
- కరీంనగర్ మున్సిపాలిటీలో బిజెపి జెండా ఎగరేస్తాం
- కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు

కరీంనగర్, జనవరి 13 అక్షర వేదం)

ఉపాధి హామీ పథకం పేరు మార్చడంపై కాంగ్రెస్ చేస్తున్న రాజకీయాన్ని నీచ రాజకీయంగా కేంద్రమంత్రి బండి సంజయ్ అభివర్ణించారు. వాల్మీకీ-అంబేద్కర్ ఆవాస్ యోజన (వాంబే) పేరుతో వాజ్‌పేయి తీసుకొచ్చిన ఇండ్ల పథకాన్ని కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎందుకు తీసేశారని ప్రశ్నించారు. వాల్మీకీ, అంబేద్కర్ పేర్లు తొలగించి ఇందిరా ఆవాస్ యోజనగా ఎందుకు మార్చారని, ఇది ఆ మహానుభావులను అవమానించడం కాదా అని విమర్శించారు. అలాగే గతంలో

-మిగతా 2 లో



## చలితో ఢిల్లీ గజగజ..

- ఈ సీజన్‌లోనే అత్యంత కనిష్టానికి ఉష్ణోగ్రతలు..
- ఐఎండీ కీలక హెచ్చరికలు

న్యూఢిల్లీ : జనవరి 13 అక్షర వేదం

ఉత్తరభారతాన్ని చలిపులి వణికిస్తోంది. దేశ రాజధాని ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, హర్యానా, మధ్యప్రదేశ్, హర్యానా సహా పలు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. దేశ రాజధాని ఢిల్లీ లో ఈ సీజన్‌లోనే అత్యంత కనిష్టానికి ఉష్ణోగ్రతలు పతనమయ్యాయి.మంగళవారం ఉదయం రాజధానిలో ఉష్ణోగ్రతలు 3 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. ఈ శీతాకాలంలో ఇదే అతి కనిష్ట ఉష్ణోగ్రత కూడా.

-మిగతా 2 లో

## కవితను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే అవకాశం లేదు

- బిఆర్ఎస్‌కు గతమే తప్ప భవిష్యతు లేదు...రాదు
- కెసిఆర్ కుటుంబ అవినీతిపై కవిత వ్యాఖ్యలే నిదర్శనం
- మీడియాతో పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



హైదరాబాద్, : జనవరి 13 అక్షర వేదం

: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారంటూ కొద్దిరోజులుగా వస్తున్న వార్తలపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తోసిపుచ్చుతూ.. అలాంటిదేమీ లేదని అన్నారు. మంగళవారం నాడు మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. కవితను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే అవకాశమే లేదని స్పష్టం చేశారు. తెలంగాణాలో బీఆర్ఎస్ పార్టీకి గతం తప్ప.. భవిష్యత్తు లేదంటూ వ్యాఖ్యానించారు. కేసీఆర్ కుటుంబ అవినీతి గురించి కవిత నిజాలు చెప్తున్నారన్నారు. తాము చేసిన ఆరోపణలపై కవిత సమాధానం రూపంలో రుజువైందని చెప్పారు.

-మిగతా 2 లో

## సందడిగా నారావారిపల్లె

- పలు అభివృద్ధి పనులకు చంద్రబాబు శ్రీకారం
- ఆటలు, రంగువల్లులతో అలరించిన పోటీలు
- గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానం

తిరుపతి,

సంక్రాంతి పండుగ సందర్భంగా స్వగ్రామం నారావారిపల్లిలో సీఎం చంద్రబాబు నాయుడు పలు ముఖ్యమైన ప్రాజెక్టులను ప్రారంభించడంతో పాటు శంకుస్థాపనలు చేశారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి అక్కడికక్కడే ఆదేశాలు ఇచ్చారు. ముఖ్యంగా రంగంపేట - భీమవరం నుంచి లింగేశ్వరాలయానికి వెళ్లే తారురోడ్డును సీఎం ప్రారంభించారు. అలాగే చంద్రగిరి మండల ప్రజలకు సాగునీరు.. తిరుమల, తిరుపతికి తాగునీరు అందించేందుకు నీవా బ్రాంచ్ కెనాల్ నుంచి కల్యాణ్ డ్యామ్‌కు కృష్ణా జలాలను తీసుకురావడానికి రూ.126 కోట్లతో మూలపల్లి చెరువు వద్ద శంకుస్థాపన చేశారు.స్వర్ణ నారావారిపల్లి అభివృద్ధిలో భాగంగా అధునాతన సాంకేతికతను ఉపయోగించి 4.2 కోట్ల రూపాయలతో నిర్మించిన




-మిగతా 2 లో

## పది నిముషాల ఛాలెంజ్‌కు చెక్




మొదటి తరువాయి

. బ్లింకిట్, జెప్టో, స్విగ్గీ సహా ఇతర క్విక్ కామర్స్ ప్రతినిధులతో సమావేశమై డెలివరీ భాగస్వాముల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని చర్చించారు. కేంద్రం ఆదేశాల మేరకు బ్లింకిట్ వంటి ఈ-కామర్స్ ఫాట్ ఫామ్‌లు 10 నిమిషాల డెలివరీ క్లెయిమ్‌లను తొలగించినట్లు సమాచారం. ఇతర కంపెనీలు తమ బ్రాండ్ ప్రకటనలు, సోషల్ మీడియా ఎలాట్ ఫామ్‌ల నుంచి ఈ డెలివరీ ప్రకటన తొలగిస్తామని ప్రభుత్వానికి హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. డెలివరీ ఏజెంట్లు ఇటీవల చేస్తున్న ఆందోళన దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకోవడం గిగ్ వర్కర్లకు ఊరట కలుగినట్టు పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

## 18న మేడారంలో కేబినేట్ భేటీ ?

మొదటి తరువాయి

హాజరవుతారు. అదే రోజు సాయంత్రానికి ముఖ్యమంత్రి సహా మంత్రివర్గం మేడారం చేరుకుంటుంది. 5 గంటల తర్వాత క్యాబినెట్ సమావేశమయ్యే అవకాశాలున్నాయి. 19న ఉదయం అమ్మవార్ల నూతన ప్రాంగణ ప్రారంభోత్సవం, దర్శనం అనంతరం ముఖ్యమంత్రి హైదరాబాద్‌కు తిరుగు పయనమవుతారు. అదే రోజు రాత్రి దావోస్‌కు వెళ్తారు. 18న మేడారంలో నిర్వహించాలని యోచిస్తున్న మంత్రివర్గ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించనున్నారు. ముఖ్యంగా త్వరలో పురపాలక ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో పట్టణాభివృద్ధి పథకాలపై చర్చించే అవకాశముంది. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలపైనా క్యాబినెట్ భేటీలో నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. ఫిబ్రవరి 1న కేంద్ర బ్జడెట్ ప్రవేశపెట్టనుండడంతో.. అందుకు అనుగుణంగా శాఖల వారీగా రాష్ట్ర బడ్జెట్ రూపకల్పనపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిసింది. రైతుభరోసా నిధుల విడుదల, హ్యామ్ రోడ్లు, తదితర అంశాలపైనా నిర్ణయాలు తీసుకునే అవకాశముంది.

## బెంగళూరులో దారుణ ఘటన

మొదటి తరువాయి

పోలీసులూ ఆ కోణంలోనే దర్యాప్తు చేపట్టారు. అయితే, ఇది సాధారణ మరణం కాదని ఫోరెన్సిక్ నివేదికలో తేలింది. ఆమె శరీరానికి నిప్పు అంటుకోకముందే చేతిపై గాయాలయ్యాయని, ఆపై ఊపిరాడక చనిపోయినట్లు వైద్యులు తేల్చారు. దీంతో పోలీసులు అక్కడి సీసీ కెమెరాల ఫుటేజ్‌లు సేకరించారు. ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించారు. షర్మిల, ఆమె మిత్రుడు ఉండే ఎ÷-లాట్ పక్కనే కొడగు జిల్లా విరాజ్‌పేటెకు చెందిన ఇంటర్ సెకండియర్ విద్యార్థి కర్నల్ కురై (18) తల్లితో కలిసి ఉంటున్నాడు. ఈ నెల 3న షర్మిల స్నేహితుడు ఇంట్లో లేని సమయంలో కురై ఆమె ఉండే గదిలోకి కిటికీలోంచి దూరాడు. లైంగిక కోర్కె తీర్చాలని ఒత్తిడి తేవడంతో షర్మిల గట్టిగా అరుస్తూ తోసివేశారు. కోపం పట్టలేని ఆ యువకుడు.. వంటగదిలోని కత్తితో ఆమెపై దాడి చేశాడు. ఆమె పరుపుపై పడిపోగా, మరోసారి కొట్టాడు. అరవొద్దంటూ నోటిని దిండుతో గట్టిగా మూయడంతో షర్మిల ఊపిరాడక చనిపోయారు.ఆపై సాక్ష్యాలను నాశనం చేసేందుకు రక్తపు మరకలున్న ఆమె దుస్తుల్ని తీసి, అదే గదిలో నిప్పంటించి కాల్చేశాడు. మంటలు వ్యాపించడంతో అక్కడి నుంచి పారిపోయేందుకు మళ్లీ కిటికీలోంచి దూకేశాడు. ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి ఆమె మరణించిందని, సహజ మరణంగా చూపేందుకు ఇలా చేసినట్లు నిందితుడు పోలీసుల విచారణలో అంగీకరించాడు. షర్మిల సెల్‌ఫోన్‌లోని వివరాలు ఈ కేసు దర్యాప్తునకు ఉపకరించాయి. మృతురాలి స్నేహితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## ఇరాన్‌తో వ్యాపార దేశాలపై ట్రంప్ అక్కసు

మొదటి తరువాయి

ఆమెరికాకు వార్నింగ్ ఇస్తూ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ చేశారు. శత్రువుల ముందు తలొగ్గేది లేదని గతంలో పలుసార్లు చాటి చెప్పాం. ఇప్పటికైనా అమెరికా మోసపూరిత చర్యలకు దూరంగా ఉండాలి. మా దేశానికి ద్రోహం చేస్తున్న కిరాయి మూకలపై ఆధారపడడం మానెయ్యాలి. ఇరాన్ చాలా బలమైన, శక్తివంతమైన దేశం. శత్రువు గురించి మాకు తెలుసు. వారిని ఎలా ఎదుర్కోవాలో మాకు తెలుసు. వారిని ఎదుర్కోవడానికి మేం ఎల్లప్పుడూ సిద్ధంగానే ఉంటాం' అని ఖమేనీ పోస్ట్ చేశారు. ప్రజలు చేస్తున్న నిరసనలు హింసాత్మకంగా మారడంతో ఇరాన్‌పై సైనిక చర్యను చేపట్టడం గురించి అమెరికా ఆలోచిస్తోంది. ఇరాన్‌పై వైమానిక దాడులు చేయడం ఒక ఆప్షన్‌గా ఉందని ట్రంప్ యంత్రాంగం ఇటీవల ప్రకటించింది. అలాగే ఇరాన్‌తో వాణిజ్యం చేసే దేశాలపై 25 శాతం సుంకాలు విధిస్తున్నట్టు తాజాగా ట్రంప్ ప్రకటించారు. ఇరాన్‌తో వాణిజ్యం చేసే దేశాల్లో చైనా, తుర్కియే, యూఏఈ, భారత్ ముందు వరుసలో ఉన్నాయి.

## చలితో ఢిల్లీ గజగజ..

మొదటి తరువాయి




దీంతో చలి తీవ్రతకు ప్రజలు గజగజ వణికిపోతున్నారు. చలి మంటలు వేసుకొని ఉపశమనం పొందుతున్నారు. మరోవైపు ఉత్తరాది రాష్ట్రాలకు భారత వాతావరణ శాఖహెచ్చరికలు జారీ చేసింది. తీవ్రమైన చలిగాలులు, దట్టమైన పొగమంచు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. మరోవైపు ఢిల్లీ నగరంలో వాయు కాలుష్యం కూడా తీవ్రంగానే ఉన్నది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రకారం.. మంగళవారం ఉదయం ఢిల్లీలో ఏక్యూఐ లెవెల్స్ వెరీ పూర్ కేటగిరీ (337)గా నమోదయ్యాయి.

## వీధి కుక్కల బాధ్యత రాష్ట్రాలదే

మొదటి తరువాయి

న్యాయస్థానం స్పష్టం చేసింది.కుక్క కరిచిన ప్రభావం బాధిత వ్యక్తిపై జీవితకాలం ఉంటుందని న్యాయస్థానం పేర్కొంది. ఈ సందర్భంగా వీధి కుక్కలకు ఆహారం పెడుతున్న వారిపైనా కోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఏదైనా సంస్థ ఆహారం పెడుతున్న కుక్కల దాడిలో ఓ చిన్నారి మరణిస్తే.. అప్పుడు ఎవరిని బాధ్యుల్ని చేయాలి? ఆ ప్రాణనష్టానికి సదరు సంస్థ బాధ్యత వహించదా అని ప్రశ్నించింది. ఇక, వీధికుక్కలకు ఆహారం పెట్టే వారి గురించి మాట్లాడుతూ.. మీకు శు నకాలపై అంత ప్రేమ ఉంటే.. వాటిని మీ ఇంటికి తీసుకెళ్లి పెంచుకోండి. వీధి కుక్కల సమస్య



భావోద్వేగభరిత అంశమని అంటున్నారు. మీ భావోద్వేగం కేవలం కుక్కల పైన మాత్రమేనా? మేం మనుషుల గురించి కూడా సమానంగా ఆందోళన చెందుతున్నాం. కుక్కలు వీధుల్లో తిరుగుతూ ప్రజలను భయపెట్టే పరిస్థితిని మేం ఆమోదించబోం అని ధర్మాసనం వెల్లడించింది. దేశవ్యాప్తంగా వీధి కుక్కల దాడుల ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో గతేడాది నవంబరులో సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. విద్యాసంస్థలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, క్రీడా సముదాయాలు, ఇతర బహిరంగ ప్రదేశాల సమీపంలోని వాటిని షెల్టర్లకు తరలించాలని ఆదేశించింది. ఈ అంశంపై సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతోంది.

## ఉగ్రవాదానికి తెగిస్తే గట్టిగా బుద్ధి చెబుతాం

మొదటి తరువాయి

పాకిస్థాన్ చిన్న తప్పు చేసినా.. భూతల దాడులను ప్రారంభించేందుకు కూడా నాడు మేం పూర్తి సన్నద్ధంగా ఉన్నాం అని ఆర్మీ చీఫ్ నాటి పరిస్థితులను వివరించారు. అలాగే ఈశాన్య సరిహద్దులో పరిస్థితులు స్థిరంగానే ఉన్నాయని, అయితే అప్రమత్తంగా ఉండటం కీలకమని వెల్లడించారు. చైనా సరిహద్దులోని భద్రత గురించి మాట్లాడుతూ.. భారత మోహరింపులు బలంగా ఉన్నాయని చెప్పారు. భవిష్యత్‌లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు ఎదురైనా వాటిని సమర్థవంతంగా ఎదుర్కొంటామని పాకిస్థాన్‌కు పరోక్షంగా గట్టి హెచ్చరికలు చేశారు. జమ్మూకశ్మీర్‌లో పరిస్థితులు సున్నితంగానే ఉన్నా.. ప్రస్తుతం అవి నియంత్రణలోనే ఉన్నాయన్నారు. ఇక వివాదాస్పద షక్సాగామ్ వ్యాలీలోని ప్రాంతం తమ దేశంలో భాగమేనని చైనా చేసిన వాదనను భారత్ మరోసారి తిప్పికొట్టింది. ఆ వ్యాలీ అప్పగింతకు సంబంధించి 1963లో పాకిస్థాన్, చైనా మధ్య జరిగిన ఒప్పందం చట్టవిరుద్ధమని జనరల్ ఉపేంద్ర ద్వివేది వెల్లడించారు. ఈ వివాదం పై స్పందించారు. 'షక్సాగామ్ వ్యాలీని చైనాకు అప్పగిస్తూ బీజింగ్‌తో పాకిస్థాన్ చేసుకున్న ఒప్పందం చెల్లదు. ఆ ప్రాంతంలో జరిగే ఏ కార్యకలాపాలను మేం గుర్తించబోం. చైనా-పాక్ ఆర్థిక కారిడార్ విషయానికొస్తే.. అది ఆ రెండు దేశాలు సంయుక్తంగా చేస్తోన్న చట్టవిరుద్ధమైన చర్యగానే మేం పరిగణిస్తాం' అని జనరల్ ఉపేంద్ర ద్వివేది స్పష్టం చేశారు. షక్సాగామ్ వ్యాలీ ప్రాంతంలో చైనా చేపట్టిన అభివృద్ధి పనులపై ఈ నెల 9న భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. 'పాకిస్థాన్-చైనా పేర్కొంటున్న 1963 నాటి సరిహద్దు ఒప్పందాన్ని మేం ఎప్పటికీ గుర్తించబోం. దీనిపై మా నిర్ణయంపై మారదు. షక్సాగామ్ వ్యాలీ మా దేశంలో భాగమే అని స్పష్టం చేసింది. దీనిపై చైనా స్పందిస్తూ.. భారత్‌పై అక్కసు వెళ్లగక్కింది. ఆ ప్రాంతం తమ దేశంలో భాగమేనని, అక్కడ తాము చేపడుతున్న అభివృద్ధి పనులపై భారత్ అభ్యంతరం చెప్పడానికి అవకాశం లేదని పేర్కొంది. షక్సాగామ్ వ్యాలీ కీలకమైన కారకోరమ్ రహదారిలో ఉంది. స్వాతంత్ర్యం రాగానే పాకిస్థాన్ దీన్ని ఆక్రమించుకుంది. అనంతరం దీనికి చైనాకు ధారాదత్తం చేసింది. భారత్‌కు చెందిన ప్రాంతాన్ని ఆక్రమించుకుని మరొక దేశానికి ఇవ్వడం అంతర్జాతీయ చట్టాల ప్రకారం విరుద్ధం. ఈ వ్యాలీని బీజింగ్‌కు అప్పగించడం ద్వారా పాకిస్థాన్‌తో చైనాకు రహదారి సౌకర్యం ఏర్పడింది. దీని మీదుగానే చైనా-పాకిస్థాన్ ఆర్థిక నడవాను బీజింగ్ నిర్మిస్తోంది.

## కవితను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే అవకాశం లేదు

మొదటి తరువాయి

కవిత మాటలతో కేసీఆర్ అవినీతి నిజమని ప్రజలు అర్థం చేసుకుంటున్నారని ఆయన చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణా ప్రయోజనాలే ముఖ్యమని.. ఒక్క నీటిబొట్టును కూడా వదలమని తేల్చిచెప్పారు. అజారుద్దీన్, కోదండరామ్ ఎమ్మెల్సీల విషయంలో మంచి స్పందన వస్తోందని నమ్ముతున్నట్లు తెలిపారు. ఏప్రిల్‌లో కార్పొరేషన్ ఛైర్మన్లను భర్తీ చేస్తామని ప్రకటించారు. పదవులు తక్కువ అయ్యాయని... ఆశావహులు ఎక్కువ అయ్యారని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల కోసం పార్టీ తరఫున ఒక కమిటీ వేస్తామని.. సర్వేల ఆధారంగా టికెట్ల ఇస్తామని చెప్పారు. గెలిచే అభ్యర్థులకే టికెట్ ఇస్తామని మహేశ్ కుమార్ పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పొత్తుపై పీఏసీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. బీజేపీని తెలంగాణాలో నమ్మే పరిస్థితి లేదన్నారు మహేశ్ కుమార్. మత రాజకీయాలు రాష్ట్రంలో నడవవని అన్నారు. రాముడికి, బీజేపీకి సంబంధమేంటి అని ఆయన ప్రశ్నించారు. తాము హిందూ ఆచారాలను



పాటిస్తామని.. కానీ హిందూ సెంటిమెంట్‌తో ఓట్లు అడగమని తెలిపారు. తనకు, సీఎం రేవంత్ మధ్య మంచి సాన్నిహిత్యం ఉందన్నారు పీసీసీ చీఫ్. మంత్రులకు, సీఎంకు మధ్య ఎలాంటి గ్యాప్ లేదని మహేశ్ తేల్చిచెప్పారు. ఇతర మంత్రుల శాఖల్లో ముఖ్యమంత్రి తలదూర్చరన్నారు. మంత్రులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నారని వెల్లడించారు. డీ సెంట్రలైజేషన్ కోసమే మేడారంలో క్యాబినెట్ సమావేశం ఏర్పాటు చేస్తున్నారని పీసీసీ చీఫ్ తెలిపారు. కేసీఆర్.. కుమారుడికి ఒక జిల్లా, కూతురికి ఒక జిల్లా, అల్లుడికి ఒక జిల్లా ఇచ్చారని పీసీసీ చీఫ్ ఆరోపణలు గుప్పించారు. కేసీఆర్ అశాస్త్రీయంగా జిల్లాలను విభజించారని మండిపడ్డారు. శాస్త్రీయంగా జిల్లాల పునర్విభజన చేయాలని కమిటీ వేస్తున్నామని తెలిపారు. సికింద్రాబాద్‌ను ఎవరు ముట్టుకున్నారని తలసాని శ్రీనివాస్ యాదవ్ గాబరాపడుతున్నారని ప్రశ్నించారు. వ్యక్తిగత జీవితాలతో ఆడుకునే హక్కు ఎవరికీ లేదన్నారు. మహిళా అధికారులపై ఆధారాలు లేకుండా వార్తలు రాస్తే ఎంత ఇబ్బంది పడతారో అర్థం చేసుకోవాలన్నారు. సోషల్ మీడియాను కట్టడి చేయాలన్నారు. పదేళ్లలో వచ్చిన ఉద్యోగాలు ఎన్ని.. రెండేళ్లలో ఇచ్చిన ఉద్యోగాలు ఎన్నో నిరుద్యోగులు అర్థం చేసుకోవాలని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## గాంధీపేరుతో కాంగ్రెస్ నీచ రాజకీయం

మొదటి తరువాయి

ఎన్టీఆర్ టెర్మినల్‌గా ఉన్న హైదరాబాద్ విమానాశ్రయ టెర్మినల్ పేరును తీసేసి రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుగా ఎందుకు మార్చారని బండి సంజయ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలపై తీవ్ర విమర్శలు గుప్పించిన ఆయన.. గాంధీ పేరును వాడుకున్నారే తప్ప మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని కాంగ్రెస్ నేతలు పాతరేసి ఆయన ఆత్మను క్షోభకు గురిచేశారని ఆరోపించారు. వారసత్వ రాజకీయాలను గాంధీ వ్యతిరేకించారని గుర్తుచేశారు. అలాగే ఆయన పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ వ్యాఖ్యలపై స్పందించారు. రాముడి బాటలో నడుస్తామని, రాముడి ఆలయాలను నిర్మిస్తామని తాము చెప్పినప్పుడు కాంగ్రెస్‌కు నొప్పి ఎందుకు వస్తోందని ప్రశ్నించారు. దేశంలో అనేక పథకాలు కేంద్ర,రాష్ట్ర భాగస్వామ్యంతోనే నడుస్తున్నాయని, ఈ పథకానికి రాష్ట్ర భాగస్వామ్యం కల్పిస్తే తప్పేముందని నిలదీశారు. ఉపాధి కూలీల వేతనాలను కూడా సకాలంలో ఇవ్వలేని కాంగ్రెస్ నేతలు మాట్లాడటం విడ్డూరమని విమర్శించారు. కరీంనగర్ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించిందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు మొత్తం రూ.50 కోట్లు విడుదల చేసినట్లు ఆయన వెల్లడించారు. ఇందులో కేంద్ర వాటా రూ.40 కోట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ నిధులతో కరీంనగర్ రూపురేఖలు పూర్తిగా మారబోతున్నాయని అన్నారు. స్మార్ట్ సిటీ, స్వచ్ఛ భారత్, అమృత్ తదితర వివిధ కేంద్ర పథకాల ద్వారానే కరీంనగర్ అభివృద్ధి జరుగుతోందని బండి సంజయ్ స్పష్టం చేశారు. ఈ విషయాన్ని కరీంనగర్ ప్రజలు గమనిస్తున్నారని అందుకే ఈసారి కార్పొరేషన్‌పై కాషాయ జెండా ఎగరేయడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. అన్ని పార్టీల నేతలు బీజేపీలోకి రావడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. టిక్కెట్ల కేటాయింపులో కాషాయ కార్యకర్తలకే మొదటి ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు ఆయన. అవినీతి ఆరోపణలు లేదా రౌడీషీట్లు ఉన్నవారిని పార్టీలోకి తీసుకోమని తేల్చిచెప్పారు. గతంలో కేసీఆర్ తన ఇష్టానుసారంగా కొడుకు, కూతురు, అల్లుడి కోసం కుటుంబ ఆస్తులు పంచినట్లే జిల్లాల ఏర్పాటు చేశారని ఆరోపించారు. అదే తరహాలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని డిమాండ్ చేశారు. ప్రజలకు మంచి జరుగుతుంటే కాంగ్రెస్‌కు ఎందుకు అక్కసు అని ప్రశ్నించిన బండి సంజయ్, గ్రామాల్లో ఆస్తులు నిర్మించడం తప్పా..? రైతులకు మేలు చేసే పథకం కాదా..? తెలంగాణకు అదనంగా రూ.340 కోట్లు వస్తుంటే వద్దంటారా..? అంటూ నిలదీశారు. వీబీజీ రామ్ జీ పథకం కావాలా..? వద్దా..? కాంగ్రెస్ స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. 'వీబీ జీరామ్ జీ' పథకంతో ఉపాధి కూలీల ఆదాయం రెట్టింపు అవుతుందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. 'ఈ పథకం ద్వారా ఏడాదికి 200 రోజుల ఉపాధి దొరుకుతుంది. పనుల విషయంలో కేంద్రం జోక్యం ఉండదు. ఈ పథకం కోసం గతంలో కంటే అదనంగా రూ.17 వేల కోట్లు వెచ్చిస్తున్నాం. తెలంగాణలో ఈ పథకం అమలుకు అదనంగా రూ.340 కోట్లు ఇవ్వబోతున్నాం. రైతులకు న్యాయం చేసేలా దీన్ని తీసుకొచ్చాం. వ్యవసాయ సీజన్‌లో ఈ పథకం పనులు జరగవు. దీంతో కూలీలు అందుబాటులో ఉంటారని తెలిపారు.

## సందడిగా నారావారిపల్లె

మొదటి తరువాయి

33/11 కేవీ సబ్ స్టేషన్‌ను సీఎం ప్రారంభించారు. అలాగే ప్రకృతి వ్యవసాయ మోడల్ ప్లాంటేషన్, డ్రోన్‌ను ఉపయోగించి మందులు పిచికారీ చేయటాన్ని ప్రారంభించారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నూతన భవనానికి ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు. ఎస్వీ యూనివర్సిటీ, మహిళా యూనివర్సిటీ, రుయా ఆసుపత్రులకు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. కాగా.. సంక్రాంతి సంబరాల్లో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామం నారావారిపల్లికి విచ్చేశారు. చంద్రబాబుతో పాటు ఆయన సతీమణి నారా భువనేశ్వరి, కుమారుడు మంత్రి నారా లోకేశ్, కోడలు నారా బ్రాహ్మణి తదితర కుటుంబ సభ్యులు గ్రామస్థులతో కలిసి సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటుచేసిన వినోదాత్మక క్రీడలు, ముగ్గుల పోటీలు, రంగవల్లులు అందరినీ ఆకట్టుకున్నాయి. ముగ్గుల పోటీలతో పాటు క్రీడా పోటీలను చంద్రబాబు దంపతులు ఆసక్తిగా తిలకించారు. పోటీలలో గెలుపొందిన చిన్నారులకు ఈ దంపతులు బహుమతులు అందజేశారు. నారావారిపల్లికి చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పిల్లలు క్రీడల్లో పాల్గొన్నారు. ఒక్కో స్కూల్ పిల్లలతో వేరు వేరుగా చంద్రబాబు దంపతులు గ్రూప్ ఫొటో తీసుకున్నారు . అందరితో పాటు నారా, నందమూరి కుటుంబాలకు చెందిన పిల్లలు గ్రామీణ క్రీడల్లో పాల్గొన్నారు. వీరిలో గెలుపొందిన వారికి అందరితో పాటు బహుమతుల ప్రదానం చేశారు. చంద్రబాబు ఇంటి ముందర ఉన్న గ్రౌండ్లో పోటీలు నిర్వహించి.. బహుమతులు అందజేశారు.

# మంథని ఆర్టీసీ బస్టాండ్ లో వృద్ధుల ఇబ్బందులు

**- బస్టాండ్ లో ప్రయాణికుల సౌకర్యార్థం కనీసం వీల్ చైర్స్ లాంటివి అన్న అందుబాటులో ఉంచాలని ఆర్టీసీ యాజమాన్యాన్ని కోరుతున్న ప్రయాణికులు**



అక్షర వేదం/మంథని,జనవరి13: తెలంగాణ వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రతి రోజు కొన్ని వేల మంది సామాన్య ప్రజానికం వారి అవసరాల రీత్యా బస్సు ప్రయాణాలు సాగిస్తూ ఉంటారు.ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని ప్రచారం చేసే ఆర్టీసీ అధికారులు ప్రయాణికులకు కల్పించే సదుపాయాలు మాత్రం ఆచరణలో ఏమాత్రం లేవు.బస్టాండ్ లోపలికి వచ్చే చోట,బస్సు ఎక్కే ప్రయత్నంలో వృద్ధులు,వికలాంగులు జారీ కిందపడే ప్రమాదకర పరిస్థితి ఉంది.ఇప్పటికే ఎంతోమంది ప్రయాణికులు జారి కింద పడ్డ గాయాల పాలైన సందర్భాలు కూడా ఉన్నాయి.మరి కొద్ది రోజుల్లో మేడారం జాతర ప్రారంభం కానుంది.ప్రతి రోజు కొన్ని లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ఎంతో దూర ప్రాంతాల నుండి ప్రయాణాలు సాగిస్తూ ఉంటారు.బస్టాండ్ లో దిగిన తర్వాత నడవలేని స్థితిలో ఉన్న ప్రయాణికుల కోసం ప్రైవేటు వాహనంలో వారి గమ్యస్థానాలకు చేరే క్రమంలో కనీస అవసరాలైన వీల్ చైర్స్ అలాంటివి కూడా అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.బస్టాండ్ లోపలకు వచ్చే క్రమంలో వేగిరపాటుతో ఇప్పటికే ఎంతో మంది జారి కిందపడి కాళ్లు,చేతులు విరిగిన సందర్భాలు కూడా ఉన్నాయి.తెలంగాణ ప్రభుత్వం మరి ముఖ్యంగా ఆర్టీసీ బస్సుల్లో మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశ పెట్టడం ద్వారా ఆర్టీసీకి ఆక్యూపెన్సి, ప్రయాణికుల జీరో టిక్కెట్ల ద్వారా ప్రభుత్వం ఆదాయాన్ని కూడా పెంచేది.కానీ ఆర్టీసీ సిబ్బంది మాత్రం ప్రయాణికుల కనీస సౌకర్యాల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ చోద్యం చూస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.బస్సులో మాత్రం సీనియర్ సిటిజన్స్ కు ముందు వరుసలో సీట్లు, సౌకర్యాలని బోర్డులపై రాతలు నియమాల వరకే పరిమితమవుతుంది. కానీ ఆచరణలో ఏమాత్రం సాధ్యం లేదు.కనీస అవసరాలు కూడా అందుబాటులో లేవు.బస్సు వెనుక నుండి ప్రయాణికులు దాటే క్రమంలో ఇదే బస్టాండ్ లో ప్రాణాలు పోయిన సందర్భాలు కూడా ఉన్నాయి.కదా ఏదైనా ప్రమాదం జరిగితే దానికి ఆర్టీసీ సిబ్బందా,డ్యూటీలో ఉన్న మీర ఎవరు బాధ్యత వహిస్తారని సెక్యూరిటీని విలేఖరి ప్రశ్నిస్తే నాకేం సంబంధమని నిర్లక్ష్యంగా దురుసుగా సమాధానం ఇస్తున్నాడు.కొన్ని రోజుల క్రితం ఇదే బస్టాండ్లో ఒక ప్రయాణికుడు ఆర్టీసీ వెనుక నిచ్చెనపై ఎక్కి బ్రిడ్జి దాకా పోయేవరకు కూడా సిబ్బంది గుర్తించని పరిస్థితి.ఆర్టీసీ పర్యవేక్షణ,భద్రత నిర్లక్ష్యంపై రోడ్డు వెంబడి వెళ్లే ప్రయాణికులు ఆశ్చర్యానికి గురైన పరిస్థితి.ఇప్పటికైనా ఆర్టీసీ మేనేజర్ అధికారుల్లో చలనం వచ్చి ఈ సమస్య పరిష్కారానికి మార్గం చూపాలని ప్రజలు భావిస్తున్నారు..

# మన గమ్యం యమపురికి కాదు
# మన గమ్యం సురక్షితంగా ఇంటికి

**వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ కచ్చితంగా పాటించాల్సిందే**
**మేడిపల్లి సీఐ గోవింద్ రెడ్డి.**
**ప్రమాదం చెప్పి రాదు సురక్షంగా వాహనాన్ని నడిపి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోండి.**
**'అరైవ్ అలైవ్ణకార్యక్రమంలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.**




అక్షర వేదం/మేడ్చల్ మల్కాజ్గిరి/ మేడిపల్లి ;జనవరి 13
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "అరైవ్ అలైమ కార్యక్రమంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించి, ప్రజల్లో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పించాలనే ముఖ్య ఉద్దేశంతో మంగళవారం నాడు మల్కాజ్గిరి కమిషనరేట్ మేడిపల్లి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "అరైవ్ అలైమ అనే ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాన్ని ఉప్పల్ డిపో జోనల్ వర్క్ షాపులో నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ మేడిపల్లి ఆర్ గోవింద్ రెడ్డి మాట్లాడుతూ వాహనదారులు, పాదచారులు మరియు సాధారణ ప్రజలు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని తెలిపారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణించే యువత హెల్మెట్ ని కచ్చితంగా ధరించాలని, ట్రాఫిక్ సిగ్నల్స్ సూచనలను తప్పకుండా పాటించాలని, అతివేగంతో నిర్లక్ష్యంతో విలువైన ప్రాణాలను కోల్పోకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జోనల్ వర్క్ షాప్ మేనేజర్ జగన్ మాట్లాడుతూ దాదాపు 80 శాతం రోడ్డు ప్రమాదాలు ద్విచక్ర వాహనాల వల్లనే జరుగుతున్నాయన్నారు, మేడిపల్లి తహసిల్దార్ కృష్ణ చైతన్య మాట్లాడుతూ కార్లలో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనం నడప రాదని ,మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ వాహనం నడపకూడదనే అంశాలపై స్పష్టంగా వివరించారు, ఆర్థోపెడిక్ డాక్టర్ రోహిత్ మాట్లాడుతూ ప్రమాదం చెప్పి రాదు అని సురక్షంగా వాహనాన్ని నడిపి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు, రోడ్డు ప్రమాదంలో జరిగిన తీవ్రమైన గాయాల ద్వారా తను చేసిన సర్జరీలను అనుభవపూర్వకంగా వివరించారు, తీవ్రమైన గాయాలైన బాధితులు రోడ్డు ప్రమాదంలో తన కుటుంబాన్ని కోల్పోయిన బాధితులు తాము ఎంత శోకసంద్రం లో సామాజికంగా, ఆర్థికంగా, మానసికంగా శోభను అనుభవిస్తున్నామని వివరించారు.

ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా ప్రతి ఒక్కరూ తమ కుటుంబానికి సురక్షితంగా చేరుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ డిపో చెంగిచెర్ల డిపో డ్రైవర్లు సిబ్బంది, ఆటో యూనియన్ ప్రతినిధులు, డ్రైవర్స్ మరియు లారీ ప్రతినిధులు డ్రైవర్స్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# పన్నూర్ గ్రామం లో "అరైవ్ అలైమ రోడ్డు భద్రతా అవగాహన సదస్సు






అక్షర వేదం: జనవరి 13,రామగిరి
రామగిరి మండలం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "అరైవ్ అలైమ రోడ్ సేఫ్టీ ॰ సేఫ్ డ్రైవ్ అవగాహన కార్యక్రమం ఈ రోజు రామగిరి మండలం పన్నూర్ గ్రామంలో ప్రజల భాగస్వామ్యంతో అత్యంత విజయవంతంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి రామగిరి మండల సబ్ ఇన్స్పెక్టర్ టీ. శ్రీనివాస్,ఎస్సై దివ్య, పోలీస్ అధికారులు, సిబ్బంది, పన్నూర్ గ్రామ సర్పంచ్ చిందం మహేష్ వార్డ్ మెంబర్స్ గ్రామ ప్రజాప్రతినిధులు,యువకులు, మహిళలు, విద్యార్థులు భారీ సంఖ్యలో ప్రజలు కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరయ్యారు.రామగిరి మండల సబ్ ఇన్స్పెక్టర్ టీ శ్రీనివాస్ మరియు సబ్ ఇన్స్పెక్టర్ దివ్య మాట్లాడుతూ.రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా ఈ రోజు పన్నూరు గ్రామానికి రావడం జరిగింది. రోడ్డు భద్రతపై సరైన అవగాహన లేకపోవడం వల్ల వాహనం నడిపే వారికి మాత్రమే కాకుండా, రోడ్డు మీద ప్రయాణించే పాదచారులకు కూడా ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ పరిస్థితిని మార్చాలనే ఉద్దేశంతోనే ఈ రోజు మీ గ్రామానికి వచ్చాము అని అన్నారు.రోడ్డు భద్రతపై అవగాహన ఉంటేే, మన ప్రాణాలే కాకుండా మనతో పాటు రోడ్డు మీద ప్రయాణించే ఇతరుల ప్రాణాలను కూడా కాపాడగలుగుతాము. మనం ఎలా వాహనం నడపాలి, ఎలా రోడ్డు దాటాలి, ఎలా జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయాలపై ప్రజలందరిలో అవగాహన కల్పించడమే మా ముఖ్య ఉద్దేశం. మన దేశంలో యుద్ధాల్లో మరణించే వారికంటే, రోడ్డు ప్రమాదాల్లో మరణించే వారి సంఖ్య ఎక్కువగా ఉంది. ఇది మనందరినీ ఆలోచింపజేయాల్సిన విషయం. వాహనం నిర్లక్ష్యంగా నడపడం, రోడ్డు నిర్లక్ష్యంగా దాటడం, సిగ్నల్స్ పట్టించుకోకపోవడం వంటి చిన్న తప్పులే పెద్ద ప్రమాదాలకు కారణమవుతున్నాయి.వాహనం ఒక్కసారిగా అదుపు తప్పితే, రోడ్డు పక్కన ఉన్నవారికి, షాపుల్లో ఉన్నవారికి కూడా ప్రాణాపాయం కలుగుతుంది. అందుకే ప్రతి ఒక్కరూ రోడ్డు నియమాలు తప్పక తెలుసుకోవాలి, తప్పక పాటించాలి.రోడ్డు భద్రత అనేది కేవలం పోలీస్ డిపార్ట్‌మెంట్ బాధ్యత మాత్రమే కాదు. రోడ్డు రవాణా శాఖ బాధ్యత మాత్రమే కాదు. దేశంలో ఉన్న ప్రతి పౌరుడి బాధ్యత ఇది.18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి.టూ వీలర్ నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి.ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించిన తర్వాత వాహనం నడపరాదని, అవసరమైతే వేరే డ్రైవర్‌ను ఏర్పాటు చేసుకోవాలని లేదా వాహనం ఉపయోగించకుండా ఇంటికి చేరాలని ప్రజలను పోలీసులు కోరారు.


## పండుగ సీజన్ కోసం కొత్త కలెక్షన్లను ప్రవేశ పెట్టిన రామ్‌రాజ్ కాటన్



హైదరాబాద్, జనవరి 13 (అక్షర వేదం) : భారత దేశ నంబర్ 1 సాంప్రదాయ, ఎత్నిక్ దుస్తుల బ్రాండ్ రామ్‌రాజ్ కాటన్ పొంగల్ సంక్రాంతి పండుగ సీజన్‌కు ముందుగా తన కొత్త కల్చర్ క్లబ్ మ్యాచింగ్ ధోతీలు, షర్టుల కొత్త శ్రేణులను ప్రవేశపెట్టినట్లు రామరాజ్ కాటన్ ది కల్చర్‌ప్రెనర్ ఫౌండర్ చైర్మన్ కె.ఆర్.నాగరాజన్ మంగళవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ శ్రేణిలో రాస్ప్‌బెర్రీ, చెర్రీ రెడ్, రిచ్ బ్లూ, గోల్డెన్ ఎల్లో, జంగిల్ గ్రీన్, పెస్టో వంటి రంగుల్లో అందుబాటులో ఉన్న ధోతి-షర్ట్ సెట్‌లను అందిస్తున్నట్లు తెలిపారు. చిన్న పిల్లల కోసం కూడా ప్రత్యేక డిజైన్ల ధోతీలు, షర్టులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. పండుగ దుస్తుల ఎంపికను సులభతరం చేస్తూ కుటుంబానికి సరైన స్టైల్ అందిస్తుందని తెలిపారు. ఈ సేకరణలో మ్యాచింగ్ ధోతి, షర్ట్ సెట్లు, మ్యాచింగ్ ధోతి, ప్రింటెడ్ షర్ట్ సెట్లు, కాటన్ షర్ట్, టిష్యూ ధోతి సెట్లు, సిల్క్ లుక్ షర్ట్, టిష్యూ ధోతి సెట్లు ఉన్నట్లు తెలిపారు. ఇవి కాన్సెప్ట్ వేర్, కుటుంబ సమావేశాలు, ఫంక్షన్లు, ఎత్నిక్ దినోత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పండుగ సందర్భాలకు సరైనవని తెలిపారు. 100 శాతం కాటన్, కాటన్ బ్లెండ్స్, కాటన్-రిచ్ ఫాబ్రిక్స్‌తో రూపొందించబడిన ఈ శ్రేణి, క్లాసిక్ సాలిడ్ మరియు ప్రింటెడ్ షర్టులను సున్నితంగా నేసిన ధోతీలతో మిళితం చేస్తుందన్నారు. సాంప్రదాయాన్ని పునర్జీవింపజేస్తూ, పండుగ రోజంతా ఆకర్షణీయంగా, సౌకర్యవంతంగా ఉండే దుస్తులను అందిస్తున్నట్లు చెప్పారు.

## బక్కన్న యాదవ్ ను పరామర్శించిన డా.దాసరి అజయ్ కుమార్ యాదవ్

**-ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న యాదవ జేఏసీ చైర్మన్**



హైదరాబాద్, జనవరి 13 (అక్షర వేదం) : షాద్ నగర్ పట్టణ కేంద్రంలో అనారోగ్యంతో బాధపడుతున్న అఖిల భారత యాదవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బక్కన్న యాదవ్ ను యాదవ జేఏసీ చైర్మన్ డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ మంగళవారం పరామర్శించారు. అనంతరం బక్కన్న యాదవ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో యాదవ జేఏసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అంజి యాదవ్, మీడియా కన్వీనర్ ప్రశాంత్ యాదవ్, గడ్డం శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మొబైల్ లో సిఎంపిఫ్ బ్యాలన్స్ చూసుకోవచ్చు కమిషినర్లు




అక్షర వేదం:జనవరి 13,రామగిరి
మొబైల్ లో సిఎంపిఫ్ బ్యాలన్స్ చూసుకోవచ్చునని కమిషనర్లు హరిపచౌరీ,డాక్టర్ గోవర్ధన్ అన్నారు.మంగళవారం జి.యం కార్యాలయం నందు రామగుండం-3 ఏరియా లోని ఓ.సి-1 ఉపరితల గనిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు వాహనాల డ్రైవర్ల కు వారి సియంపిఎఫ్ బ్యాలన్స్ వివరాలను సి- కేర్స్ వెబ్ సైట్ ద్వారా వారి బాలన్స్ వివరాలు వారివారి మొబైల్ ఫోన్ లో చూపించడం జరిగింది.అలాగే వారి బ్యాలన్స్ ఎలా చూసుకోవచ్చునో అవగాహన కల్పించారు.వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థ లోనే మొట్ట మొదటిసారిగా రామగుండం-3 ఏరియాలో కాంట్రాక్టు డ్రైవర్ల కోసం చేసిన ప్రయత్నం ఫలించినదని అందుకు సహకరించిన అధికారులకు,ఉద్యోగులకు అభినందనలు తెలిపారు.ఇదే విధంగా అన్ని ఏరియాల్లో చేయడం జరుగుతుందిదని తెలిపారు.బ్యాలన్స్ చూసుకోవడాని ఇక ముందు పాస్ బుక్ చిట్టీ అవసరం లేకుండా ఎప్పుడైనా వారి వారి బ్యాలన్స్ అమౌంట్ ఫోన్ లో చూసుకోవచ్చని అన్నారు.కార్యక్రమంలో ఎస్వోటుజియం యం.రామ్మోహన్, పర్సనల్ విభాగపతి సుదర్శనం,డివై పియం సునీల్ ప్రసాద్,ఫైనాన్స్ విభాగం అధికారి భరత్, సిబ్బంది అనిత,కుమార స్వామి,తదితరులు పాల్గొన్నారు.

## రత్నాపూర్ గ్రామాభివృద్ధికి సహకరించండి

**- నూతన సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు విజ్ఞప్తి**



**అక్షర వేదం:ద జనవరి 13,రామగిరి**

రామగిరి మండలం రత్నాపూర్ గ్రామాభివృద్ధికి సహకరించని నూతన సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కు వినతి పత్రం అందించారు.రామగిరి ఖిల్లాలోని మేడిపల్లి శివారులో 200 ఎకరాల భూములు తీసుకుంటున్నారు. మా గ్రామాభివృద్ధికి సహకరించలని కోరారు.ఇండస్ట్రీయల్ పార్కు కొరకు భూములను తీసుకుంటున్నారు.ఈ క్రమంలో మా గ్రామం అభివృద్ధి కొరకు నిధులు కేటాయించగలరనీ మనవి.రామగిరి ఖిల్లా రహదారి అయిన రత్నాపూర్-మన్నాల వాడ వరకు సిమెంట్ రోడ్డు,డ్రైనేజీ నిర్మించాలి. రత్నాపూర్ లోని సంజీవనగర్ ఆర్అండ్ బీ రోడ్డు నుంచి వాగుకట్ట మీద నుంచి తులభూమయ్య పొలం మీదుగా రామగిరిఖిల్లాకు వెళ్లే రోడ్డు వరకు సిమెంట్ రోడ్డు,డ్రైనేజీ నిర్మించాలి.రత్నాపూర్ గ్రామంలోని కెక్కర్ల శివ ఇంటి ముందు నుండి (పల్లె వాడ) గూడ్ల రమేష్ ఇంటి వరకు సిమెంట్ రోడ్డు, డ్రైనేజీ నిర్మించాలి.రైతుల పొలాలకు వెళ్లే రహదారైన పల్లె మీద నుంచి శ్రీరాంసాగర్ కాలువ మీదుగా తెట్టెకుంట నుంచి ఆర్ఎస్ఐ ఆఫ్ డి/83 ప్రధానకాలువ వరకు మట్టి రోడ్డు అద్వాన్నంగా మారింది.దీనిని కంకర రోడ్డు లేదా తారు రోడ్డు వేయాలనీ కోరారు.రాంనగర్ లో వాటర్ ట్యాంక్ ఎదురుగా ఉన్న లైన్ అద్వాన్నంగా మారింది. నూతన సీసీ రోడ్డు నిర్మాణం చేయించగలరని కోరారు.

## ఎం.ఎన్.జె. క్యాన్సర్ ఆస్పత్రిలో అన్నదానం

**-చేసిన టిఎన్ జిఓ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని**




**హైదరాబాద్, జనవరి 13 (అక్షర వేదం) :**

ఎం.ఎన్.జె క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు, వారి సహాయకులకు తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్(టిఎన్ జిఓ) కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.హుస్సేనీ(ముజీబ్) నేడు అన్నదానం చేశారు. అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతివారం క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న ఈ సేవలో భాగంగా, ఈ వారం కూడా డాక్టర్ ముజీబ్ స్వయంగా పాల్గొని రోగులకు భోజన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చికిత్స కోసం వచ్చే పేద రోగులకు, వారి సహాయకులకు ఆకలి బాధలు కలగకూడదనే ఉద్దేశంతో ప్రతి వారం ఈ అన్నదాన కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సేవా యజ్ఞం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టి.ఎన్.జి.ఓ. కేంద్ర సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్ కస్తూరి వెంకట్, హైదరాబాద్(సిటీ) యూనియన్ అధ్యక్షుడు కె.శ్రీకాంత్, కార్యదర్శి కుర్రాడి శ్రీనివాస్, అసోసియేట్ ప్రెసిడెంట్ కె.ఆర్. రాజ్ కుమార్, హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏ.వి.శ్రీధర్ పాల్గొన్నారు. వీరితో పాటు తెలంగాణ రాష్ట్ర క్లాస్-4 ఎంప్లాయీస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఖాదర్ బిన్ హసన్, ఎం.ఎన్.జె. క్యాన్సర్ ఆస్పత్రి యూనిట్ ప్రెసిడెంట్ శివ కుమార్, ఉస్మాన్ అలీ, రామకృష్ణ, వహీద్ తదితరులు పాల్గొని రోగులకు సేవలు అందించారు.

## విద్యుత్ సమస్యలపై ప్రజా బాట కార్యక్రమం




**అక్షర వేదం:జనవరి 13,రామగిరి**

మంగళవారం రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో క్షేత్ర స్థాయిలో విద్యుత్ సమస్యల పరిష్కారం కొరకు ప్రజా బాట కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కల్వచర్ల గ్రామ సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి పాల్గొన్నారు.కల్వచర్ల గ్రామంలో నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ డి.ఇ ప్రభాకర్,ఏ. డి.ఇ వెంకటనారాయణ,ఏ.ఇ మహేందర్ రెడ్డి,ఎస్. ఎల్.ఐ శ్రీనివాస్,ఎల్.ఐ భూమయ్య,ఎల్.ఎం శ్రీనివాస్,ఏ.ఎల్.ఎం రాజ్ కుమార్,హెల్పర్ లక్ష్మణ్ కల్వచర్ల గ్రామంలో క్షేత్రస్థాయిలో విద్యుత్ సమస్యల పరిష్కారం కొరకు ప్రజాబాట అనే కార్యక్రమం చేశారు.ఈ కార్యక్రమంలో కల్వచర్ల పంచాయతీ కార్యదర్శి శ్రీధర్,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కుర్ర సహస్ర జ్ఞాపకార్థంగా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

**- జ్ఞాపకార్థమైన క్రీడా పోటీలు ఆటగా కాదు సమాజానికి ఒక మంచి సందేశాన్ని ఇస్తాయి.**





**అక్షర వేదం:జనవరి 13,రామగిరి**

కల్వచర్ల గ్రామానికి చెందిన కుర్ర కొమరమ్మ కుమారుడు రమేష్, లావణ్య గార్ల కుమార్తె కుమారి సహస్ర జ్ఞాపకార్థంగా రాణి రుద్రమ దేవి స్టేడియంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎరుకల యువత కోసం ఘనంగా నిర్వహించారు.ఆర్గనైజర్లుగా రేవల్లి మహేష్,సార్ల రమేష్,కుర్ర కుమార్ వ్యవహరించారు.పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా మాజి జెడ్పిటిసి గంట వెంకట రమణారెడ్డి,పన్నూరు సర్పంచ్ చిందం మహేష్,లద్నపూర్ పూర్ సర్పంచ్ వనం రామచంద్రరావు,లయన్స్ క్లబ్ అధ్యక్షులు మేకల మారుతి యాదవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు కుటుంబ సభ్యులతో కలిసి కుమారి సహస్ర చిత్రపటానికి నివాళులర్పించి కబడ్డీ పోటీలను ప్రారంభించారు.ఈ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో విజయం సాధించిన మొదటి జట్టు కల్వచర్ల టీమ్ కి రూ.15,000 నగదు,రెండో జట్టు జమ్మికుంట టీమ్ కి రూ.10,000 నగదు బహుమతితో పాటు మమెంటోలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ రోజుల్లో కొన్నిచోట్ల ఆడబిడ్డ పుట్టిందనే కారణంతోనే అమానుష ఘటనలు చోటు చేసుకుంటున్న దుర్మార్గమైన పరిస్థితులు మన కళ్ల ముందే కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.అలాంటి కాలంలో తన కుమార్తె సహస్ర జ్ఞాపకార్థంగా తండ్రి రమేష్ ఈ విధంగా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడం సమాజానికి ఒక గొప్ప సందేశమని తెలిపారు.ఆడపిల్లపై గౌరవం,ప్రేమ,బాధ్యతను చాటేలా ఈ కార్యక్రమం నిలిచిందని,కుమారి సహస్ర జ్ఞాపకాన్ని క్రీడల ద్వారా చిరస్థాయిగా నిలిపిన రమేష్‌ను పలువురు అభినందించారు.ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో ఆడబిడ్డ విలువను చాటుతాయని వక్తలు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,యువత, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని పోటీలను విజయవంతం చేశారు.

# కళ్యాణం...కమనీయం..!





**- జనసంద్రం మధ్య ఇటిక్యాల వెంకటేశ్వర స్వామి ఆలయం**

**- గోవిందా అంటూ నామస్మరణతో మారుమోగిన ఇటిక్యాల గ్రామం....**

**- గోవిందా గోవిందా అంటూ కళ్యాణాన్ని తిలకించిన భక్తులు...**

**రాయికల జనవరి13,అక్షర వేదం:**

శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి గోవిందా గోవిందా అంటూ నామస్మరణతో మారుమోగిన ఇటిక్యాల గ్రామం పులకరించింది. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసంలో భాగంగా మంగళవారం రోజున గోవిందా రంగనాదుల కళ్యాణ మహోత్సవం రాయికల్ మండలంలోని ఇటిక్యాల గ్రామంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి గోవిందా రంగనాదుల కళ్యాణం కన్నుల పండుగగా నిర్వహిం చారు. భక్తులు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి మొక్కులు తీర్చుకున్నారు వేద పండితుల మంత్రోచ్చరణలు. భజన సంకీర్తన చేస్తూ డప్పు వాయిద్యాల మధ్య కన్నుల పండగగా గోవింద రంగనాదుల కళ్యాణం జరిపించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు . స్వామి వారి కళ్యాణం చూడడం వలన అంత శుభం కలుగుతుందని భక్తుల నమ్మకం అందుకే కళ్యాణాన్ని చూడడానికి గ్రామస్తులు చుట్టుపక్కల గ్రామ ప్రజలు భక్తులు భారీగా తరలివచ్చారు భక్తుల తో గ్రామం మొత్తం నామస్వరనతో గోవిందా గోవిందా గోదారంగనాథల కళ్యాణ మహోత్సవం పండితులు రామకృష్ణ చార్యులు అంగరంగ వైభవంగా కనుల పండుగ నిర్వహించారు. మహిళలందరూ గోదాదేవి అమ్మవారికి ఓడిబియ్యం కనుమలు కుడుకలు సమర్పించారు.అనంతరం భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి అశ్విని జాదవ్ తిరుపతి, డాక్టర్ రఘునాథ్, అర్చకులు, నాయకులు గ్రామ సర్పంచ్ నీరటి శ్రీనివాస్, సామల వేణు, కాటిపల్లి గంగారెడ్డి, వార్డు సభ్యులు కొక్కెర రాజేందర్ యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు బోడుగం మల్లారెడ్డి, సురకంటి నాగిరెడ్డి, కనపర్తి శ్రీనివాస్, కొల్లూరు వేణు, చౌదరపు శ్రీధర్, గ్రామ పెద్దలు, గ్రామ నాయకులు, ప్రజాపతినిధులు యువకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ ప్రయోజనాలకు ఆటంకం కలిగిస్తున్న బూడిద మాఫియా పై చర్యలు తీసుకోవాలి..





**- కోమల్ల మహేష్ బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి**

**అక్షరవేదం/గోదావరిఖని: జనవరి13**

ఎన్ టి పి సి యాష్ పాండ్ నుండి బూడిదను తరలించకుండా అడ్డుకుంటున్న మాఫియా పై చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి జిల్లా భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యదర్శి కోమల మహేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో మహేష్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ టి పి సి యాష్ పాండ్ కి చెందిన బూడిదను జాతీయ ప్రజా రవాణా రోడ్డు నిర్మాణాలకు వినియోగించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో ఎన్ టి పి సి ద్వారా బూడిదను తరలించేందుకు టెండర్లు పిలిచారని, టెండర్ వచ్చిన సంస్థలకు చెందిన యంత్రాలు యాష్ పాండుకు రాకుండా అడ్డుకుంటున్నారని మహేష్ ఆరోపించారు. బూడిదను తరలించకుండా జాతీయ ప్రయోజనాలు దెబ్బతిస్తూ పర్యావరణానికి హాని కలిగే విధంగా జాతీయ రోడ్డు నిర్మాణానికి బూడిద తరలించకుండా అడ్డుపడుతున్న మాఫియా పై చర్యలు తీసుకోవాలని సంబంధిత సిఐఎస్ఎఫ్ డిజి, రాష్ట్ర డిజిపి, రామగుండం పోలీస్ కమిషనర్ లను కోరారు. అంతేకాకుండా కేంద్ర మంత్రులకు కూడా ఫిర్యాదు చేయనున్నామని ఈ సమస్యను రెండు రోజులలో పరిష్కరించకుంటే బిజెపి ఆధ్వర్యంలో యాష్ పాండ్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుల్వ లక్ష్మీనర్సయ్య, కొండపర్తి సంజీవ్, మిట్టపల్లి సతీష్, ఐత పవన్, అంజి, చిరంజీవి, శివరామకృష్ణ, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులు పెన్షనర్ల అన్ని రకాల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

**– తపస్సు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వడ్నాల రాజశేఖర్ తెల్కలపల్లి పెంటయ్య**




(అక్షర వేదం ప్రతినిధి, హైదరాబాద్ )
ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లపెండింగ్ లో ఉన్న అన్ని డిఎ లు, అన్ని రకాల పెండింగ్ బిల్లులు వెంటనే ప్రకటించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం – తపస్ రాష్ట్ర అధ్యక్షులు వోడ్నాల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య లు కోరారు. హెల్త్ కార్డులతో సహా ప్రభుత్వం ప్రకటించిన విధంగా 700కోట్లు ప్రతి నెల విడుదల చేసి బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 6 డిఎ లలో ఒక్క డిఎ ఇస్తూ 30 విడతలు గా బకాయిలు చెల్లిస్తామని జీవో ఇవ్వడం దారుణమని అన్నారు.

## జి పి ఎన్నికలలో RO-1, RO-2, ఇతర ఎన్నికల సిబ్బందికి రెమ్యూనరేషన్ పెంచి ఇవ్వాలి.

**- తపస్ రాష్ట్ర శాఖ డిమాండ్**



తపస్ రాష్ట్ర శాఖ ప్రాతినిధ్యం

(అక్షర వేదం ప్రతినిధి, హైదరాబాద్ )
గ్రామ పంచాయితీ ఎన్నికలలో RO--1, RO--2 మరియు ఇతర ఎన్నికల సిబ్బందికి చెల్లించిన రెమ్యూనరేషన్‌ను పునఃసమీక్షించాలి అలాగే రానున్న మున్సిపల్ కార్పొరేషన్, ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలలో తగిన రెమ్యూనరేషన్ ను ఎన్నికల్లో విధులు నిర్వహించే ఎన్నికల సిబ్బందికి చెల్లించాలని రాష్ట్ర ఎన్నికల అధికారికి వినతిపత్రం సమర్పించి డిమాండ్ చేసిన రాష్ట్ర తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్ ) రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ , ప్రధాన కార్యదర్శి శ్రీ పెంటయ్య , తపస్ రాష్ట్ర సంఘటన కార్యదర్శి శ్రీ హన్మంత్ రావ్, కాశీరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

**- మంథని ఎస్ఐ డేగ రమేష్**




అక్షర వేదం/మంథని,జనవరి13:
తెలంగాణ రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల నివారణకు, ప్రాణనష్టాన్ని తగ్గించేందుకు ప్రతి పౌరుడూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని మంథని ఎస్సై డేగ రమేష్ తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా రాష్ట్ర పోలీస్‌శాఖ చేపట్టిన అరైవ్ అలైవ్ రోడ్డు సేఫ్టీ ప్రచార కార్యక్రమంలో భాగంగా పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం రోజున మంథని కాలేజీ గ్రౌండ్ లో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై డేగ రమేష్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు నివారణకు ప్రతి పౌరుడు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. రోడ్డు ప్రమాదాలతో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ప్రతి రోజు జరుగుతున్న ప్రమాదాలను గుర్తుపెట్టుకుని ప్రజల్లో భద్రతపై అవగాహన తప్పనిసరి పెరగాలని సూచించారు.
మద్యం సేవించి వాహనాలు నడపడం రాంగ్ సైడ్ డ్రైవింగ్ సిగ్నల్ జంపింగ్ వంటి నిర్లక్ష్యపు చర్యలే ఈ ప్రమాదాలకు కారణమని ఆయన అన్నారు. హెల్మెట్ ధరించండి ప్రాణాలు కాపాడుకోండి అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ప్రజలు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..

# ఆయన చూపు సజీవం..!



అక్షరవేదం/గోదావరిఖని: జనవరి13
మంచిర్యాల జిల్లా చెన్నూరు కు చెందిన జంగ భగవంత రెడ్డి (72) మరణించినా, ఆయన చూపు మాత్రం సజీవంగా ఉంది. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని మాతంగి కాంప్లెక్స్ లోని సంఘమిత్ర సూపర్ మార్కెట్ నిర్వాహకుడు జంగ సతీష్ తండ్రి భగవంత రెడ్డి నేత్రాలను దానం చేసి స్ఫూర్తిగా నిలిచారు. పెద్దపల్లి జిల్లా సింగరేణి మేడిపల్లి ఓపెన్ కాస్ట్ లో పని చేసి రిటైర్డ్ అయిన భగవంత రెడ్డి, మంగళవారం తెల్లవారుజామున హైదరాబాద్ కు చికిత్స కోసం తరలిస్తుండగా అకాల మరణం చెందాడు. నేత్రాలను దానం చేస్తే ఇద్దరు అంధులకు చూపు వస్తుందని, మృతుని కొడుకు సతీష్ కు జర్నలిస్ట్ యూనియన్ పెద్దపల్లి జిల్లా ఎథిక్స్ కమిటీ కో కన్వీనర్ పందిళ్ళ శ్యామ్ సుందర్, సదాశయ ఫౌండేషన్ ప్రచార కార్యదర్శి కే.ఎస్.వాసు అవగాహన కల్పించారు. దీంతో తండ్రిని కోల్పోయిన దుఃఖంలో కూడా సమాజహితం కోసం నేత్రాలను దానం చేయడానికి మృతుని భార్య విజయమ్మ, కొడుకు సతీష్ – సరిత, కూతురు – అల్లుడు గిరిజ – నవీన్, మనుమడు అక్షిత్ రెడ్డి, మనుమరాళ్ళు అక్షయ, తమన్వీ ముందుకు వచ్చారు. ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ సహకారంతో మృతుని నేత్రాలను సేకరించి, హైదరాబాద్ కు తరలించారు. విషాదంలో ఇద్దరు అంధులకు వెలుగులు ప్రసాదించిన కుటుంబ సభ్యులను సదాశయ ఫౌండేషన్, రామగుండం లయన్స్ క్లబ్ ప్రతినిధులు అభినందించారు.

# క్రైస్తవ మైనార్టీలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం



అక్షర వేదం/మంథని,జనవరి13:
క్రిస్మస్ పండుగ సందర్భంగా చర్చిల అలంకరణ పెయింటింగ్,లైటింగ్ కొరకు నిధులు కేటాయిస్తామని క్రైస్తవ మైనారిటీలకు తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ఇచ్చి మాట నెరవేర్చింది. సోమవారం రోజున రాత్రి శివ కిరణ్ గార్డెన్ లో నిర్వహించిన సమావేశం లో 30 వేల చెక్కును తెలంగాణ రాష్ట్ర ఐటి,పరిశ్రమలు శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా అందుకున్న క్రైస్తవ మైనారిటీ లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం ఎంసిపిఎఫ్ కమిటీ అధ్యక్షులుఎలీషా,అధ్యక్షులు డేవిడ్,ఉపాధ్యక్షులు జయరాజ్,కార్యదర్శి కన్నూరీ అశోక్,జాయింట్ కార్యదర్శి జోషి,కోశాధికారి ఆరుమల్ల దైవ కృపాకర్,ఎగ్జిక్యూటివ్ మెంబర్లు సుదర్శన్,జోసెఫ్ జిల్లా సంక్షేమ మైనారిటీ సీనియర్ సహాయకులు ఆఫ్సన్ ఆభరర్,మంథని నియోజకవర్గ పాస్టర్లు మధుసూదన్,దూడపాక మహేష్ లు ఉన్నారు. రూ. 30 వేల చెక్కును అందజేసిన మంత్రి శ్రీధర్ బాబు కు క్రైస్తవ మైనారిటీ లు కృతజ్ఞతలు తెలిపారు..

## ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితా పరిశీలించిన అడిషనల్ కలెక్టర్ జె అరుణశ్రీ



అక్షరవేదం/గోదావరిఖని: జనవరి13
తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన నోటిఫికేషన్ లో పేర్కొన్న షెడ్యూల్ ప్రకారం మంగళ వారం రామగుండం నగర పాలక సంస్థ ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితా ప్రదర్శించారు. అదనపు కలెక్టర్, కమిషనర్ జె, అరుణ శ్రీ రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితా పరిశీలించారు. ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాకు సంబంధించి సలహాలు, సూచనలు ఈ నెల 14,15 తేదీలలో నగరపాలక సంస్థ కార్యాలయంలో లిఖితపూర్వకంగా సమర్పించవచ్చని ఆమె తెలిపారు. ఈ సంధర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ మారుతి ప్రసాద్, సెక్రెటరీ ఉమా మహేశ్వర్ రావు, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎసిపి. శ్రీహరి, టిపిఎస్ నవీన్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా సత్య సాయి ప్రేమ వాహిని రథ యాత్ర



అక్షర వేదం:జనవరి 13,రామగిరి
భగవాన్ సత్యసాయిబాబా వారి శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని అఖిల భారతదేశం వ్యాప్తంగా నిర్వహిస్తున్న శ్రీ సత్య సాయి ప్రేమ వాహిని రథయాత్ర తెలంగాణ రాష్ట్రంలో జోగులాంబ గద్వాల జిల్లాలలో ప్రారంభమై సోమవారం రాత్రి పెద్దపెల్లి జిల్లా రామగిరి మండలం కల్వచర్లకు చేరుకొని మంగళవారం ఉదయం భక్తుల సందర్శనార్థం కల్వచర్ల,సెంటనరికాలనీ పురవీధుల గుండా ప్రయాణించగా భక్తులు మంగళహారతి, పూలు, పూలమాలతో స్వాగతించి,టెంకాయలు,పండ్లు ప్రసాదాలు సమర్పించి సత్యసాయి బాబా ఆశీస్సులు పొందారు. 8వ కాలనీ శ్రీ సత్య సాయి సేవా సంస్థ సమితి కన్వీనర్ నూక రమేష్ ఆధ్వర్యంలో సింగరేణి అడ్రియాలా ప్రాజెక్ట్స్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వర్ రావు దంపతులు మొదటి టెంకాయ కొట్టి ప్రారంభించిన ఈ కార్యక్రమంలో సత్యసాయి సంస్థల జిల్లా కార్యవర్గం,సభ్యులు,సమితి కన్వీనర్లు,భజన మండలి, భక్తులు,పెద్దలు,మహిళలు కోలాటంతో, పిల్లలు స్వామివారి సందేశాల ప్లే కార్డుల ప్రదర్శనలు,బాజా భజంత్రీలతో పాల్గొని బయలుదేరగా, నిర్వాహకులు స్వామివారి పటాలు, పుస్తకములు, విభూది,పులిహోరలను భక్తులకు ప్రసాదంగా అందించారు.

# సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడిగా కొండగొర్ల బాపు



అక్షర వేదం/మహాముత్తారం ,జనవరి13 :
తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు మహాముత్తారం మండల సర్పంచుల ఫోరం అధ్యక్షునిగా కొండగొర్ల బాపు నియామకం అయినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్ బాబుకు , టీపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో సర్పంచుల ఫోరం అధ్యక్ష పదవి ఇచ్చినందుకు మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కష్టపడి పని చేస్తానని బాపు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ విజయం కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తను కంటికి రెప్పల కాపాడుకుంటానని అన్నారు. తనకు ప్రత్యక్షంగా పరోక్షంగా సహకరించిన మండల సర్పంచులకు కాంగ్రెస్ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# కనుకునూరులో వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం



అక్షర వేదం/మహాముత్తారం, జనవరి13 :
రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు , టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీను బాబు ఆదేశాల మేరకు సంక్రాంతి పండుగ సందర్భంగా మహాముత్తారం మండలం ఉమ్మడి కనుకునూరు గ్రామపంచాయతీలో ఎంపీడీవో నిశాంత్ మరియు స్థానిక సర్పంచ్ పులిసే సుమలత–రాజు ఆధ్వార్యంలో వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..యువత సన్మార్గంలో ప్రయాణించాలని మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వానికి ఉపయోగపడతాయని అన్నారు. ఈ టోర్నమెంట్లో సింగంపల్లి, యత్నారం, కనుకునూర్, రెడ్డిపల్లి గ్రామాలకు సంబంధించిన క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మారబోయిన లక్ష్మణ్, పీఈటీలు రేగ విజయ్, పులిసే గణేష్ వివిధ గ్రామాల క్రీడాకారులు పాల్గొన్నారు.

# నిడమనూరులో మెండె రమేష్ పార్ధీవ దేహానికి నివాళులు

**బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారెడ్డి సంతాపం**



నిడమనూరు, జనవరి 13 అక్షర వేదం

నిడమనూరు మండల కేంద్రానికి చెందిన గ్రామ వాస్తవ్యులు మెండె రమేష్ ఇటీవల మృతి చెందగా, ఆయన పార్థీవ దేహాన్ని బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారెడ్డి సందర్శించి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం 2వ వార్డు మెంబర్ యాదగిరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాండురంగారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రమేష్ అకాల మరణం గ్రామానికి తీరని లోటని పేర్కొంటూ, కుటుంబానికి ఫౌండేషన్ తరపున అన్ని విధాల సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంగవానికుంట ఉప సర్పంచ్ వంగాల భాస్కర్ రెడ్డి, శ్రీరాంపల్లి ఉప సర్పంచ్ గజ్జల శివారెడ్డి, తిరుమలగిరి సాగర్ మండలం మాజీ వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్ కుమార్ రెడ్డి, అనుముల మండలం మాజీ వైస్ ఎంపీపీ, తిరుమలనాథ గుడి మాజీ ఛైర్మన్ బుర్రి రామిరెడ్డి, బుసిరెడ్డి మట్టారెడ్డి, షేక్ అబ్దుల్ కరీం, కోడుమూరు వెంకటరెడ్డి, బీపీఆర్ వైడీఆర్ అధ్యక్షుడు గడ్డం సజ్జన్‌తో పాటు నిడమనూరు మండల సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణకారుల సమస్యలపై ఎమ్మెల్యే మందుల సామెల్‌కు వినతి





తుంగతుర్తి, జనవరి13 అక్షర వేదం

తుంగతుర్తి నియోజకవర్గ శాసనసభ్యులు మందుల సామెల్ ని వారి నివాసంలో రాష్ట్ర స్వర్ణకార సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణకారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై సవివరంగా చర్చించారు. స్వర్ణకారుల జీవనోపాధి, వృత్తి భద్రత, సంక్షేమ పథకాలు వంటి అంశాలను అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేను కోరారు. అలాగే స్వర్ణకారుల సమస్యలపై ఒక వినతిపత్రాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సిఫారసు చేయవలసిందిగా అభ్యర్థించారు.దీనిపై ఎమ్మెల్యే మందుల సామెల్ సానుకూలంగా స్పందించి, తక్షణమే స్వర్ణకారుల సమస్యలపై సిఫారసు లేఖను సిద్ధం చేసి రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షులు వింజమూరు రాఘవాచారికి అందజేశారు. స్వర్ణకారుల సమస్యలను ప్రభుత్వ స్థాయిలో పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రాగిఫణి సతీష్ చారి, రాష్ట్ర సహాయ కార్యదర్శులు సుంకోజు పోతులూరి ఆచారి, కర్నేకంటి రామాచారి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఎ కే రాజనర్సిమాచారి తదితరులు పాల్గొన్నారు.

# త్యాగరాజ గాన సభలో ఐకాన్ ఆఫ్ భారత్ అవార్డు-2026' ప్రదానం



హైదరాబాద్,జనవరి13 అక్షర వేదం

త్యాగరాజ గాన సభలో గోబుల్ ఫైన్ ఆర్ట్ అండ్ యోగ ఎడ్యుకేషన్ అకాడమీ ఆధ్వర్యంలో ఐకాన్ ఆఫ్ భారత్ అవార్డు--2026 ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ సముద్రాల వేణుగోపాల చారి, మాజీ కేంద్ర మంత్రి బూర్గుల మధుసూదన్, న్యాయమూర్తి డాక్టర్ మల్లెపూల వెంకటరమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా అకాడమీ చైర్మన్ డాక్టర్ మల్లెపూల వెంకటరమణ మాట్లాడుతూ, కళలు, యోగా, విద్య, సామాజిక సేవ రంగాల్లో విశేష కృషి చేసిన వ్యక్తులను గుర్తించి ప్రోత్సహించడమే ఈ అవార్డు లక్ష్యమని తెలిపారు. సమాజ నిర్మాణంలో విలువలతో కూడిన సేవలకు ఇటువంటి గౌరవాలు స్ఫూర్తినిస్తాయని అన్నారు. అవార్డు గ్రహీతలకు శాలువాలు, జ్ఞాపికలతో సత్కారం నిర్వహించారు. కళా సాంస్కృతిక ప్రదర్శనలు, యోగ ప్రాముఖ్యతపై సందేశాత్మక ప్రసంగాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. హాజరైన అతిథులు అకాడమీ సేవలను ప్రశంసిస్తూ, భవిష్యత్తులో మరిన్ని సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చైర్మన్ చిరంజీవి, విజయ కుమార్, అపర్ణ, డాక్టర్ కందికంటి వెంకన్నతో పాటు భవాని దివ్యాంగుల సేవా ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం ఉద్యోగుల కరువు భత్యం(డీఏ) పెంపు హర్షణీయం

**-స్వాగతించిన టిఎన్ జివొ కేంద్ర సంఘం, హైదరాబాద్ జిల్లా యూనియన్ నాయకులు**




హైదరాబాద్, జనవరి 13 (అక్షర వేదం) :

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల కరువు భత్యాన్ని(డిఎ) 30.03 శాతం నుండి 33.67 శాతానికి పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని తెలంగాణ నాన్-గెజిటెడ్ అధికారుల(టిఎన్ జివొ) కేంద్ర సంఘం, హైదరాబాద్ జిల్లా యూనియన్ నాయకులు ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా టీఎన్జీఓ కేంద్ర సంఘం అధ్యక్షులు మార్వం జగదీశ్వర్ మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, వివిధ సవాళ్లు ఉన్నప్పటికీ, ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా డీఏ పెంపును ప్రకటించిన గౌరవ ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ పెంపు ఉద్యోగుల ఆర్థిక భద్రతకు ఎంతో దోహద పడుతుందని అన్నారు. ప్రభుత్వంతో నిరంతరం జరిపిన చర్చల ఫలితంగానే ఈ విజయం సాధ్యమైందని, రాబోయే రోజుల్లో కూడా ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం తమ సంఘం అలుపెరగని పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్ . ఎం . వా స్సే నీ ( మ ు జీ బ్ ) మాట్లాడుతూ ఈ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూనే, త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రితో జరగబోయే అధికారిక సమావేశంలో ఉద్యోగుల ఇతర గ్రీవెన్స్‌లు, పెండింగ్ సమస్యలన్నీ పరిష్కారమవుతాయని ధీమా వ్యక్తం చేశారు. టీఎన్జీఓ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎస్.విక్రమ్ కుమార్, జిల్లా కార్యదర్శి కూడా ఈ డీఏ పెంపు పట్ల తమ సంతోషాన్ని ప్రకటిస్తూ, క్షేత్రస్థాయిలో ఉద్యోగులందరికీ ఇది ఎంతో ఊరటనిచ్చే విషయమని కొనియాడారు.

# ఘనంగా స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలు



కూకట్ పల్లి జనవరి 13,అక్షర వేదం

మూసాపేట్ మారుతీ నగర్‌లో స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలు భక్తి, ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. తుమ్ శైలేష్, పంచాశీల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పలువురు రాజకీయ, సామాజిక నాయకులు పాల్గొని యువతకు మార్గదర్శిగా నిలిచిన మహానాయకుడు స్వామి వివేకానందకు ఘన నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా నేతలు స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ భారత యువతకు ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం, త్యాగబుద్ధిని నేర్పిన యుగపురుషుడు స్వామి వివేకానంద అని కొనియాడారు. "లేచెయ్, మేలుకొనెయ్, లక్ష్యాన్ని చేరేవరకు ఆగకండి" అనే ఆయన సందేశం నేటి తరానికి దిశానిర్దేశకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ వికాస్ సమితి అధ్యక్షులు, కూకట్పల్లి కాంటెస్టెడ్ ఎమ్మెల్యే భాశెట్టి నర్సింగరావు, బీజేపీ సీనియర్ నాయకులు యంజాల్ పద్మయ్య, బీసీ వికాస్ సమితి గ్రేటర్ హైదరాబాద్ వైస్ ప్రెసిడెంట్ చిలకా ప్రకాశ్ ముదిరాజ్, మానవ సేవ మాధవ సేవ అధ్యక్షులు, కాంగ్రెస్ లేబర్ సెల్ ఆర్గనైజర్, రాష్ట్ర కార్యదర్శి గోకర్ల లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నాయకులు డోలాక్ నర్సింగరావు, తూము పరమేష్ పటేల్, జిల్లా జీతరావు, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి పాల్గొనరావు, చందర్ రావు, సాయి తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక బస్తీ నాయకులు బాసెట్టి నరేందర్, బాసెట్టి ప్రభాకర్ చారి, కాంగ్రెస్ నాయకులు సి.హెచ్. దేవదానం సహా పలువురు నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నేతలు మాట్లాడుతూ స్వామి వివేకానంద భారతదేశ ఆత్మను ప్రపంచానికి పరిచయం చేసిన మహా తపస్వి అని, ఆయన బోధనలు కేవలం ఉపదేశాలుగా కాకుండా జీవన విధానంగా మలుచుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. జాతి నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని, జ్ఞానం, శీలం, సేవ అనే మూడు మూలసూత్రాలతో ముందుకు సాగితేనే దేశానికి నిజమైన శక్తి లభిస్తుందని పేర్కొన్నారు. స్వామి వివేకానంద ఆశయాలను ఆచరణలో పెట్టి, సమానత్వం, మానవత్వం, దేశభక్తితో కూడిన సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు.

# ఘనంగా పీజేఆర్ జయంతి వేడుకలు



కూకట్ పల్లి జనవరి 13, అక్షర వేదం

కూకట్ పల్లి నియోజకవర్గంలోని ఆచార్య వినోబాభావే పురంలో దివంగత పిజేఆర్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి భూరగణ ఫాల్గుణ రావు, కాంగ్రెస్ నేత కె. చందర్ రావు పాల్గొని పిజేఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పిజేఆర్ ఆశయాలు, సిద్ధాంతాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అధినాయకత్వానికి మరోసారి స్ఫూర్తినిస్తూ, కూకట్పల్లి ప్రాంతంలో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా స్థానిక నాయకులు సమిష్టిగా ముందుకు సాగుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, బీసీ వికాస సమితి అధ్యక్షులు, శ్రమశక్తి అవార్డు గ్రహీత భాశెట్టి నర్సింగరావు, టీపీసీసీ స్టేట్ లేబర్ సెల్ కార్యనిర్వహణ కార్యదర్శి, బీసీ వికాస సమితి ఉపాధ్యక్షులు, ప్రముఖ సామాజికవేత్త, సంఘ సంస్కర్త, వ్యాపారవేత్త, మానవసేవే మాధవసేవ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గోకర్ల లక్ష్మీనారాయణ, బీసీ వికాసంతి గ్రేటర్ హైదరాబాద్ వైస్ ప్రెసిడెంట్ చిలకా ప్రకాష్ ముదిరాజ్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు పూలగంటి నర్సింగరావు, ఎమ్మార్పీఎస్ నేత సిహెచ్. దేవదానంతో పాటు పీ. శిమాద్రి, ఆర్. వాసు, ఐ. నారాయణ, ఎల్. జైరాం, టీ. ఖగేశ్వర్ రావు, డి. వేణు, ఎస్. భీమారావు, చిన్నారావు, ఎస్. ధర్మారావు, బి. ధర్మారావు, బాలు తదితరులు పాల్గొన్నారు. పిజేఆర్ ఒక స్ఫూర్తిదాయక నేతగా, సంస్కరణల బాటలో నడిచిన నాయకుడిగా భావితరాలకు ఆదర్శంగా నిలిచారని పలువురు నేతలు కొనియాడారు. సమాజంలో సమానత్వం, న్యాయం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని వారు పేర్కొన్నారు.

# శివరావు షెట్కార్ ఆశయ సాధనకు కృషి చేయాలి



నారాయణఖేడ్,జనవరి 13 అక్షర వేదం

స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎమ్మెల్యే దివంగత శివరావు షెట్కార్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కుమారుడు, జహీరాబాద్ ఎంపీ సురేశ్ కుమార్ షెట్కార్ పిలుపునిచ్చారు. శివరావు షెట్కార్ 30వ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం నారాయణఖేడ్‌లోని ఆయన సమాధి వద్ద నిర్వహించిన సర్వధర్మ సమ్మేళనం,వర్ధంతి సభలో ఎంపీ సురేశ్ కుమార్ షెట్కార్ మాట్లాడారు. ఈ సందర్భంగా శివరావు షెట్కార్ ప్రజాసేవా దృక్పథం,రాజకీయ జీవితాన్ని ఆయన స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లను ఘనంగా సన్మానించారు. అనంతరం షెట్కార్ కుటుంబ సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు సమాధి వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఉమ్మడి జిల్లా మాజీ ప్రణాళిక సంఘ సభ్యుడు నగేశ్ షెట్కార్,రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాకేశ్ షెట్కార్,పీసీసీ సభ్యులు కే. శ్రీనివాస్, శంకరయ్య స్వామి, డీసీసీ ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి,సంగీత్ జితేంద్రనాథ్,సాగర్ షెట్కార్,మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ శెట్కార్,మాజీ జడ్పీ కోప్షన్ సభ్యులు రషీద్,దిశ కమిటీ సభ్యులు ప్రకాష్ రాథోడ్,ఖేడ్ మండల అధ్యక్షులు తాహిర్ అలీ,శివరావు షెట్కార్, నాగల్గిద్దా మండలశీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాణిక్ రావు పాటిల్,బియస్ వీర్ శెట్టి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే బాల్కి మహాలింగ అప్ప, కొండాపూర్ సంగ్రామ్ మహారాజ్,శివలింగ స్వామి సహా పలువురు ప్రముఖులు వర్ధంతి సభలో పాల్గొన్నారు.